
హైదరాబాద్ వార్త


# బడినే కాదు .. బస్సునూ చూడండి

## -పిల్లల భద్రత అత్యంత ప్రధానం - తల్లిదండ్రులు తమ బాధ్యత మరవద్దు



**హైదరాబాద్,జూన్ 14, ప్రభాతవార్త:** నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైంది. తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి విద్యా ప్రమాణాలు ఉన్న పాఠశాలల్లో చేర్పించాలని చూస్తారు. అదే సమయంలో సరైన రవాణా వసతి ఉందా లేదా తెలుసుకోవాలి. విద్యార్థులను క్షేమంగా ఇంటికి చేర్చే విద్యా సంస్థల బస్సు ప్రమాణాలు, అనుభవజ్ఞులైన డ్రైవర్లు ,నిర్వాహణపై దృష్టిసారించాలి. మెట్లు ..ఎక్కే తొలి మెట్టు విద్యార్థులకు అనువుగా 325 ఎంఎం ఎత్తులో ఉండాలి. లేకుంటే వారికి అనువుగా తాత్కాలిక బల్ల ఏర్పాటు చేయాలి. లేదా అటెండర్ విద్యార్థులను విధిగా బస్సుల్లోకి ఎక్కించడం, దించడం చేయాలి. చేతితోపట్టుకుని సులువుగా ఎక్కేందుకు, దిగేందుకు రేలింగ్ రాడ్‌లు ఉండాలి.

**అద్దాలు :** లోపలి భాగంలో డ్రైవర్‌కు ఇరుపక్కలా బయటి భాగంలో అద్దాలను అమర్చాలి. ప్రయాణ సమయంలో ప్రతి క్షణం విద్యార్థులు,ఇరుపక్కలా వస్తున్న వాహనాల తీరునూ డ్రైవర్ ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి.

**వాహనం కండిషన్ :** హెడ్‌లైట్లు ,వైపర్ ,విద్యార్థులు కూర్చునేందుకు అనువుగా సీట్లు ఉన్నాయా లేవా చూసుకోవాలి.

**టిఎస్ స్కూల్ బస్‌యాప్..**

విద్యాసంస్థల బస్సు పూర్తి వివరాలను తెలుసుకునేందుకు రవాణాశాఖ ఈయాప్‌ను అందుబాటులో ఉంచింది. ఇందులో బస్సు నెంబర్ ఎంటర్ చేయగానే బస్సు, యాజమాన్యం, డ్రైవర్ ఫోటో, అటెండర్ ఫోటోతో పూర్తి వివరాలు ,ఫోన్‌నెంబర్లు కనిపిస్తాయి.

**తల్లిదండ్రులు బాధ్యత ..**

బస్సు కండిషన్‌ను పరిశీలించాలి. నిర్దేశించిన ప్రదేశంలో సమయానికి ముందే పిల్లను తయారు చేసి బస్సువద్దకు తీసుకురావాలి. రన్నింగ్‌లో ఉన్నప్పుడు బస్సు ఎక్కించొద్దు. విద్యార్థులను బడికి పంపే సమయంలో, తిరిగి వచ్చే సమయంలో తప్పనిసరిగా కుటుంబ సభ్యులు ఉండాలి. పరిమితికి మించి విద్యార్థులు తీసుకెళ్తున్నారా గమనించాలి. అవసరమైతే తల్లిదండ్రుల సమావేశంలో ప్రశ్నించాలి.

**పాఠశాల యాజమాన్యాలు పాటించాల్సిన నిబంధనలు ..**

పసుపు రంగు బస్సులను మాత్రమే ఉపయోగించాలి. దానిపైభాగంలో నాలుగు వైపులా పసుపు రంగు (పార్కింగ్ )లైట్లు ఉండాలి. ఆగిన సమయంలో వాటిని వేయడం వల్ల ఇతర వాహనాలకు సూచనగా ఉంటుంది. డ్రైవర్‌కు భారీ వాహనాలు నడిపే లైసెన్స్ ఉండాలి. ఐదేళ్ల అనుభవం తప్పనిసరి. 60ఏళ్లలోపు మాత్రమే ఉండాలి. డ్రైవర్ లైసెన్స్ ను పాఠశాల యాజమాన్యం విధిగా ఆర్టీఏ కార్యాలయంలో తనిఖీ చేసుకోవాలి. డ్రైవర్‌కు ఖాకీరంగు యూనిఫాం ఉండేలా చూడాలి. నెలకు ఒకసారి తల్లిదండ్రులు (పేరెంట్స్ )తో సమావేశం నిర్వహించాలి. డ్రైవర్ ,అటెండర్ ఏమైనా పొరపాట్లు చేశారా .బాధ్యతలను మరిచారా ..అనే విషయాలను తల్లిదండ్రుల నుంచి తెలుసుకోవాలి. 15ఏళ్ల కాలపరిమితి దాటి వాహనాలను నడపొద్దు. బస్సులు వెళ్లే మార్గాలను సూచించే రూట్ మ్యాప్‌ను విద్యార్థులకు కనిపించే విధంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయాలి. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదు. డ్రైవర్‌తోపాటు సహాయకుడు (అటెండర్ )తప్పనిసరిగా ఉండాలి. విద్యార్థుల రోడ్డు దాటి వెళ్ళాల్సి వచ్చినప్పుడు డ్రైవర్ ముందు నుంచే దాటించాలి. ఇలా చేయడం వల్ల ఇతర వాహనదారులు నుంచి ప్రమాదాలు జరుగవు. నెలకు ఒకసారి డ్రైవర్‌కు బిపి, మధుమేహం, కంటిచూపు పరీక్షలను విధిగా చేయించాలి. ఫిట్‌నెస్ సమయంలో పాఠశాల యాజమాన్యం ,డ్రైవర్ అటెండర్ పూర్తి వివరాలను అందించాలి. డ్రైవర్ అటెండర్ పేరు ఫోన్‌నెంబర్లు బస్సుపై రాసి ఉంచాలి. రాకపోకల వివరాలు తల్లిదండ్రులకు తెలిపేందుకు అటెండర్ వద్ద ఫోన్ అందుబాటులో ఉంచాలి. సీరియల్ నెంబర్‌తో కూడిన ఫిర్యాదుల పుస్తకం అందుబాటులో ఉంచాలి.

**ప్రథమ చికిత్స పెట్టే:**

డ్రైవర్ సీటుకు వెనుక భాగంలో విధిగా ఉండాలి. ఇందులో 26రకాల మందుల సామాగ్రి (మెడికల్ కిట్ ) అందుబాటులో ఉంచాలి.

**ఫైర్ సిలిండర్ :**

కార్బన్‌డైఆక్సైడ్ (సిఓ2) ద్రావణం నింపి ఉన్న ఎరుపు రంగుతో కూడిన సిలిండర్ డ్రైవర్‌కు సమీపంలో ఉండాలి.

**మ్యాట్ :** విద్యార్థుల కాళ్లకు దెబ్బలు తగలకుండా కింది భాగంగా మ్యాట్ తప్పనిసరిగా ఉండాలి. విద్యార్థులకు రక్షణ రాడ్‌లు: విద్యార్థులు బయటకు చేతులు తలలు పెట్టకుండా బస్సు చుట్టూ ఉన్న కిటికీలకు లడ్డుగా రెండు ,మూడు ఇనుప రాడ్‌లను ఏర్పాటు చేయాలి.

**అత్యవసర ద్వారం :** డ్రైవర్‌కు కుడిచేతి వైపు బస్సుకు చితర అత్యవసర ద్వారం (ఎమర్జెన్సీ ఎగ్జిట్ ) ఉండాలి. ఈద్వారానికి లోపల బయట ఉన్న వారికి కనిపించే విధంగా ఎరుపు అక్షరాలతో అత్యవసర ద్వారా అని రాసి ఉండాలి.

# 'గంజాయి' మత్తు వదలరా!

**- నగరంలో ఎక్కడో ఒకచోట పట్టివేత**
**- తరలించిన తనిఖీలకు దొరకవు**
**- పోలీసుల చర్యలపై ఎన్నో అనుమానాలు**



**హైదరాబాద్,జూన్14, ప్రభాతవార్త:** గంజాయి నిషేదిత మత్తుపదార్థం కట్టడిలో పోలీసులు విఫలమైనట్లే తెలుస్తోంది. నగరానికి తరలించి విక్రయాలు చేస్తున్నంత వరకు తెలియకపోవడం విచారకరం. ఎక్కడో ఒక చోట దొరకడంతో అరెస్ట్‌లు, మత్తును స్వాధీనం చేసుకోవడం పరిపాటిగా మారింది. ఏళ్లనాటి నుంచి ఉన్న పూర్తి స్థాయిలో అడ్డుకట్టపడకపోవడంపై పలు విమర్శలు వెలువెత్తుతున్నాయి. పేదలు, వృద్ధులు, ఉన్నతస్థాయి విద్యార్థులకు సైతం గంజాకు అలవాటు పడుతున్నారు. ఏదోరకంగా తరలించి చాక్లెట్లు, బిస్కట్లు, పిండి, ఐస్‌క్రీంల రూపంలో రహస్యంగా విక్రేతలు అందజేస్తున్నారు. అంతేకాదు కిరాణా దుకాణాల్లో కూడా అమ్మకాలు చేపడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇటీవల గుర్తించింది. ఆన్‌లైన్‌లోనూ విక్రయాలు చేస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. వివిధ జిల్లాల నుంచి వివిధ వస్తువుల రవాణా మాటున తరలించి దళారులు వ్యాపారం చేస్తున్నారనే విషయలు వెల్లడవుతున్నాయి. అయితే పోలీసులకు పట్టుబడేది కొంతనే. కానీ గంజాయి ప్రియులకు మాత్రం పెద్దమొత్తంలో చేరుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పాన్‌షాప్, బస్తీల్లోనే విక్రయాలు కొనసాగుతున్నాయని పోలీసుల దాడుల్లో వెలుగుచూస్తున్నాయి. నిత్యం సుమారు అయిదు కిలోల విలువైన గంజాయి కేసులు నమోదుకావడంతో పోలీసుల చర్యలు మరింత కట్టుదిట్టంగా ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ముషీరాబాద్‌లో తొమ్మిది కిలోల గంజాయి, ఇటీవల హయత్‌నగర్, అంతకుముందు సికింద్రాబాద్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో పలు ఘటనలు ఉన్నాయి.

**వివిధ రాష్ట్రాల నుంచి నగరానికి...**

ఏపీతో పాటు చత్తీస్‌ఘడ్, అస్సాం, రాజస్థాన్‌తో పాటు ఆయా రాష్ట్రాల నుంచి నగరానికి తరలివస్తున్నారు. అయితే సరిహద్దులో ఉండే పోలీసుల తనిఖీల్లో బయటపడకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిఘా వైఫల్యాలు, క్షేత్రస్థాయి పోలీసుల నిర్లక్ష్యాలతోనే గంజాయి రాజ్యమేలుతుందనే ఆరోపణలు ఉన్నాయి. మత్తు పదార్థాలు బయటకు కనబడకుండా వివిధ రూపాల్లో విక్రయిస్తున్న పోలీసులు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు లేకపోలేదు. మురికివాడలు, బస్తీలలోనే విక్రయాలు జోరుగా సాగుతుంటాయనేవి పట్టుబడిన నిందితుల విచారణలో బయటపడుతున్నాయి. నెలకొకసారి కూడా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయడం లేదు. కేవలం అలంకారప్రాయంగానే చర్యలు చేపట్టడంతో గంజాయి మత్తు కిక్కెస్తోంది. అక్కడకక్కడ బహిరంగ మార్కెట్లో దొరికే వస్తువులు కావని, స్లమ్ ఏరియాలో నిరుపేదలు వాడే మత్తు పదార్థామనే విధంగా గ్రహించాలని పలువురు సూచిస్తున్నారు. అంతేకాకుండా పోలీసులకు తెలిసిన పట్టించుకోవడం లేదని, ఇది సర్వసాధారణమేనని లైట్‌గా తీసుకుంటున్నారని తెలుస్తుంది. కళాశాల్లో విద్యార్థులు సైతం గంజాయి మత్తులో పడుతున్నారని పోలీస్ దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. ఇది జీవితాన్నే అణిచివేస్తుందని, కట్టడి చేయకపోతే చాలా ప్రమాదకరమని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

**నిఘా, నిరంతర చర్యలతోనే సాధ్యం...**

పోలీసుల మొక్కుబడి చర్యలు కాకుండా బస్తీలు, మురికివాడల్లో నిరంతర నిఘా పెట్టి అనువణువు గాలింపు చర్యలు చేపట్టడంతోనే తగ్గుముఖం పడుతుందని పలువురు చెబుతున్నారు. అంతేకాకుండా పోలీసులకు దొరికిపోతవానే భయం కూడా గంజాయి స్మగ్లర్లలో ఉంటుందని భావిస్తున్నారు. ఒకటి, రెండు రోజులు కాకుండా రోజుల తరబడి చర్యలు ఉంటేనే గంజాయి అనే ఊసు ఉండదని సూచిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిచయస్తులతో గోప్యంగా చర్చించి వివరాలు రాబట్టాలి. ఎక్కడైతే అడ్డాలను పోలీసులు గుర్తిస్తే సివిల్ డ్రస్సులో నిఘాను మరింత పటిష్టం చేసి పర్యటించాలని పేర్కొంటున్నారు.

# రాష్ట్రంలో కెసిఆర్ నిషాన్‌ను తొలగించడం ఎవరి తరం కాదు

**- ఎక్కిడికెళ్లినా కెసిఆర్ నామ జపం చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి**
**- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



మణికొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి.

**నార్సింగి, జూన్ 14 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ నిషాన్‌ను తొలగించడం ఎవరి తరం కాదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మణికొండలో బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ నాయకత్వంలో ఏర్పాటు చేసిన "గుడ్‌మార్నింగ్ మణికొండ" కార్యక్రమం శతదినోత్సవ వేడుకలకు సబితారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎంగా అయ్యి ఏడాదిన్నర అవుతున్నా తెలంగాణ ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. సీఎంగా తాను చేసిన అభివృద్ధిని చెప్పి ప్రజలను తనవైపు తిప్పుకోకుండా తెలంగాణలో ఉన్నా, ఢిల్లీలో ఉన్నా, పిల్లల వద్ద అయినా, పెద్దల వద్ద కేసీఆర్ నామ జపాన్ని చేస్తున్నారన్నారు. ఎవరు ఔనన్నా కాదన్నా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మాత్రం కేసీఆర్ ఉద్యమం, ఆమరణ దీక్ష వల్లనే సాధ్యపడిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు ఉవ్విళ్లూరుతున్నారన్నారు. కేసీఆర్ హయాంలో రజకులకు ప్రతీ మున్సిపాలిటీలో 2.కోట్ల వ్యయంతో దోబీగాట్లు, 4.కోట్ల వ్యయంతో స్ట్రీట్ వెండర్ల కోసం ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మించామన్నారు. అనంతరం కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ మణికొండ బిఆర్ఎస్ నాయకులు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు నిత్యం కాలనీలు, బస్తీలలో తిరుగుతున్నారన్నారు. నాడు కేటీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఈమేజ్‌ను పెంచేందుకు రేసింగ్ పోటీలను తీసుకు వస్తే, దానిలో అవినీతి జరిగిందంటే తప్పుడు ఆరోపణలు చేస్తూ, విచారిస్తుండడం సిగ్గుచేటన్నారు. అన్నదాతలు అవస్థలు పడుతుంటే పట్టించుకోకుండా అందాల పోటీల వెంట సీఎం వెళ్లడం సిగ్గుచేటన్నారు. అనంతరం నూతనంగా పదవులు పొందిన వారికి నియామక పత్రాలు అందించారు. బిఆర్ఎస్ మణికొండ మున్సిపల్ అధికార ప్రతినిధిగా బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అందె లక్ష్మణ్‌రావ్, ఏర్పుల శ్రీకాంత్, కార్య నిర్వాహణ కార్యదర్శిగా రామసుబ్బారెడ్డి, కార్యదర్శిగా ఖలీం, ఉప్పర అశోక్, బొడ్డు శ్రీధర్, మైనార్టీ అధ్యక్షుడిగా షేక్ ఆరిఫ్, యూత్ అధ్యక్షులుగా బుద్ధోలు బాబు, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్, ఉపాధ్యక్షులుగా శ్రీశైలం ఐటి అధ్యక్షులుగా శ్రీనాథ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మోహనకృష్ణ, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా బాబురావ్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా విఠల్, సాంస్కృతిక శాఖ భానుచందర్, మైనార్టీ, క్రిస్టియన్ విభాగం అధ్యక్షులుగా జయరాం, సోషల్ మీడియా అధ్యక్షులుగా ఆరిఫ్‌షేక్ మహ్మద్, కార్యదర్శిగా సుమ నళినిలకు నియామక పత్రాలు అందజేశారు.

# మరోసారి దానం వర్సెస్ విజయారెడ్డి

## కాంగ్రెస్ పార్టీ సభలో రచ్చ రచ్చ



ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో వాగ్వాదం చేసుకుంటున్న దానం నాగేందర్, విజయారెడ్డి అనుచరులు

**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీలో మరోసారి వర్గపోరు బయట పడింది. బంజారాహిల్స్ లేక్‌వ్యూలో జరిగిన పార్టీ సభలో ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయారెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పోటా పోటీగా ఇరు వర్గాల అనుచరులు నినాదాలు చేశారు. సభలో గందరగోళం నెలకొనడంతో డిసిసి అధ్యక్షుడు డాక్టర్ ఎన్.రోహిన్‌రెడ్డి అక్కడ నుంచి అసంతృప్తితో వెళ్లిపోయారు. గతంలోనూ వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. హిమాయత్‌నగర్‌లో సన్నబియ్యం పంపిణి కార్యక్రమంలో విజయారెడ్డి ఫొటోను ఫ్లెక్సీలో పెట్టకపోవడంతో దానంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకుని విజయారెడ్డిని సముదాయించారు. ఇక మరోసారి వీరిద్దరూ బహిరంగంగా వాగ్వాదానికి దిగడంతో వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది.

# దుండిగల్ పాసింగ్ అవుట్ పెరేడ్

## -ఆకట్టుకున్న ఎయిర్ షో





**హైదరాబాద్, జూన్ 14 ప్రభాతవార్త**

దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ హాజరయ్యారు. వైమానికి దళంలోని వివిధ విభాగాల్లో ప్రీ-కమిషనింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న ఫ్లైట్ క్యాడెట్‌లు ఇందులో పాల్గొన్నారు. పరేడ్ సందర్భంగా విమానాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

# మాన్‌సూన్ రెగట్టాలో తెలంగాణ సెయిలర్ల పతకాల పంట



**హైదరాబాద్ జూన్14,ప్రభాతవార్త :** తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హుస్సేన్ సాగర్ లేక్‌లో ఆరు రోజుల పాటు జరిగిన 16వ మాన్‌సూన్ రెగట్టా చాంపియన్‌షిప్ శనివారం ముగిసింది. ఉత్కంఠగా సాగిన పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. అండర్15 బాలుర విభాగంలో రిజ్వాన్ మహమ్మద్ స్వర్ణం గెలుచుకోవడమే కాకుండా ఖిబాయ్స్ ట్రోఫీఖిని కూడా కైవసం చేసుకున్నాడు. అండర్19 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తనుజ కామేశ్వర్- శ్రావణ్ కత్రావత్ జోడీ స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. అండర్15 బాలికల విభాగంలో లాహిరి కొమరవెల్లి హోరాహోరీ పోరులో రజత పతకం సాధించింది. అంతేకాకుండా, టోర్నమెంట్‌లో అత్యంత నిలకడైన ప్రదర్శనకు ఇచ్చే ప్రతి ష్టాత్మక ఎస్.హెచ్. బాబు మెమోరియల్ ట్రోఫీఖిని గెలుచుకుంది. తమిళనాడుకు చెందిన శ్రేయ కృష్ణ స్వర్ణం సాధించింది. చివరి రోజు పోటీలు ప్రారంభమయ్యే ముందు శ్రేయ ఒక పాయింట్ ఆధిక్యంలో ఉండగా, 9వ రేసులో ఆమె వెనుకబడింది. ఇదే రేసును లాహిరి గెలిచింది. కానీ, చివరిదైన పదో రేసులో శ్రేయ ప్రథమ స్థానంలో నిలిచి, ఓపెన్,బాలికల విభాగాల్లో స్వర్ణ పతకాలను కైవసం చేసుకుంది. అండర్19 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో దీక్షిత, గణేష్ రజత పతకం సాధించారు. అండర్15 బాలికల విభాగంలో చంద్రలేఖ తాతారి, బాలుర కేటగిరీలో వినోద్ దండు కాంస్యాలు గెలుచుకున్నారు. అండర్15 బాలికల విభాగంలో తమిళనాడుకు చెందిన శ్రేయ కృష్ణ స్వర్ణం అందుకుంది. అండర్18 లేజర్ బాలికల విభాగంలో అలియా సబ్రీన్ (తమిళనాడు) బంగారు పతకం సాధించింది. అండర్19 స్కిఫ్ క్లాస్ లో కార్తీక్ కొర్రోల- హృదయ్ జోషి (గోవా) స్వర్ణం నెగ్గగా.. కృష్ణ-తంగై (మైసూర్) రజతం, అజయ్ గజ్జి, సత్యం ఝా (గోవా) కాంస్యం సాధించారు.

# రసరమ్యం నవరసభరితం సద్గురు శివానంద నృత్యోత్సవం



చిన్నారుల నృత్యోత్సవంలో దృశ్యం

**రవీంద్రభారతి, జూన్ 14 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, సద్గురు శ్రీశివానంద నృత్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సంస్థ ప్రఖ్యాత నాట్యగురువు బి.సుధీర్‌రావు నేతృత్వం, లైవ్ ఆర్కెస్ట్రాలో నేత్రపర్వంగా జరిగిన నృత్యోత్సవం రసరమ్యం, నవరస భరితంగా విచ్చేసిన అశేష ప్రేక్షకులు, కళాప్రియులను ఎంతగానో అలరించి మంత్రముగ్ధులను చేసింది. ఈ సందర్భంగా సంస్థ చిన్నారి శిష్యులు తమ నృత్యోత్సవాన్ని ఆదినారాయణతీర్థ కూర్పు సౌరాష్ట్ర రాగం ఆదితాళంలో రూపొందిన జయజయ స్వామిన్ అంశంతో ప్రారంభించి, హిందెళంరాగంలో మమవథు, ఆదితాళంలో మనస సంచారరే, వనరొభాగ్యం, సుందరకాండ, నమః శివాయతె, నందనం దన, శివాష్టకం, ప్రహ్లాదశబ్దం, చివరిగా కళ్యాణిరాగం ఆదితాళంలో తిల్లానా అంశాలను అద్భుతంగా ప్రదర్శించి శుభాశీస్సులు, ప్రశంసలు అందుకున్నారు. నట్టువాంగం, గాత్రం, సంగీతం డి.ఎస్.వి.శాస్త్రి, నట్టువాంగం, గాత్రం, కొరియోగ్రఫీ గురువు బి.సుధీర్‌రావు, మృదం గం డా. ఆర్.శ్రీకాంత్, వీరస్వామిలు, వయోలిన్ కె.సాయికుమార్, వేణువు వెంకటేష్‌లు అద్భుతంగా వాద్యసహకారం అందించి నృ త్యోత్సవాన్ని మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతి థులు చిన్నారి కళాకారులను సన్మానించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను బహూకరించి శుభాశీస్సులందజేశారు.

# గోల్కొండలో సమోసా ఫ్యాక్టరీ సీజ్



గోల్కొండ లో సమోసా ఫ్యాక్టరీని సీజ్ చేసిన ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ అధికారులు

**మెహదీపట్నం, జూన్ 14, ప్రభాతవార్త :** గోల్కొండలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న సమోసా ఫ్యాక్టరీని జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. గోల్కొండ ఫోర్ట్ బడా బజార్‌లో గత కొన్నేళ్లుగా ఎలాంటి అనుమతులు, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా సమోసా ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నాడు మమ్మద్ అల్తాఫ్. దీంతో విషయం తెలుసుకున్న స్థానికులు జిహెచ్ఎంసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి సమోసా ఫ్యాక్టరీలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఫ్యాక్టరీలోని పరిసరాలు అపరిశుభ్రంగా నెలకొనడంతో పాటు, నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని తేలింది. ఈ ఫ్యాక్టరీ కి ఫుడ్ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్ లేకపోవడంతో ఫ్యాక్టరీని సీజ్ చేసినట్లు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ మూర్తి రాజు, ఎఫ్ ఎస్ ఓ రాజేశ్వరిలు తెలిపారు.




## వైద్యుల సేవలు వెలకట్టలేనివి


పత్రాలు అందిస్తున్న తనుగుల జితేందర్‌రెడ్డి తదితరులు

**చిక్కడపల్లి, జూన్ 14 ప్రభాతవార్త:** తల్లిదండ్రులు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తారని తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ తనుగుల జితేందర్ రావు అన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించి ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్న డాక్టర్ ఎ.చైతన్య రెడ్డి శనివారం కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా జితేందర్ రావు మాట్లాడుతూ తాను కూడా చైతన్య రెడ్డి వద్ద వైద్యం చేయించుకున్న అని అన్నారు. నా ప్రాణాన్ని కూడా కాపాడాలని తెలిపారు. ఆయన రోగుల పట్ల అంకితభావం, వైద్యం పట్ల అవిశ్రాంత నిబద్ధత కనిపిస్తుందన్నారు. డాక్టర్ ఎ.చైతన్య రెడ్డి తన జీవితంలోనే కాకుండా లెక్కలేనన్ని మంది జీవితాల్లో కూడా తీవ్ర మార్పును తెచ్చారు. డాక్టర్ ఎ. చైతన్య రెడ్డి నిజంగా మన సమాజానికి ఒక వరం అని అన్నారు.

## మానవ హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తాం

**సైఫాబాద్, జూన్ 14 ప్రభాతవార్త:** మానవ హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించడమే తమ ట్రస్ట్ ముఖ్య లక్ష్యమని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ (జిహెచ్ఆర్‌టి) డైరెక్టర్ డా.సయ్యద్ సీమా ఫాతిమా, రాష్ట్ర అధ్యక్షుడు నైనంపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ట్రస్ట్‌కు తెలంగాణ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా కంటె నిరంజనయ్య, నూతన కార్యదర్శిగా బండారు శ్రీనివాస్‌ను నియమించి, వారికి నియామక పత్రాలను అందించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ హక్కులపై ప్రజల్లో పూర్తిగా అవగాహన కల్పిస్తామని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ ప్రతినిధులు షరీఫ్, రహెమాన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంచినీటి సరఫరా బంద్

**అఫ్జల్‌గంజ్, జూన్ 14ప్రభాతవార్త:** బొగ్గులకుంట రిజర్వాయర్ క్లీనింగ్ కారణంగా ఈనెల 15వ తేదిన నీటిసరఫరా నిలిపి వేయనున్నట్లు సుల్తాన్‌బజార్ వాటర్ వర్క్స్ అధికారులు తెలిపారు. 15వ తేదిన హిందీనగర్‌సెక్షన్ ప్రాంతాలైన అబిడ్స్, మురళీధర్‌బాగ్, భగవాన్ దాస్‌బాడా, ఉస్మాన్‌గంజ్, రిసాల అబ్దుల్లా, తోప్‌ఖానా, మాలకుంట, సుల్తాన్‌బజార్ సెక్షన్ ప్రాంతాలైన న్యాజ్‌ఖానా, అలీబాయ్ గల్లీ, బొగ్గులకుంట, తుల్జాగూడ, ట్రూప్‌బజార్, గన్‌ఫౌండ్రి, కుత్బీగూడ, రాంకోఠి, చౌదరిబాగ్, నయాబజార్ తదితర ప్రాంతాలల్లో ఆదివారం రోజునీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గ్రహించి మంచినీటి వినియోగదారులు సహకరించాలని కోరారు.

## మన దేశ సంస్కృతి సంప్రదాయాలు చాలా గొప్పవి


శ్రీ సీతారామ కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

**చార్మినార్, జూన్ 14 ప్రభాతవార్త :** మన దేశ సంస్కృతి సాంప్రదాయాలు చాలా గొప్పవని దూద్‌బౌలి శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి, శ్రీ సీతారామ వీరాంజనేయ స్వామి వార్ల దేవస్థానముల కమిటి సభ్యులు మహేశ్వరం నాగేశ్వర చారి అన్నారు. దేవస్థానాల 18వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పాతనగరంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు, దేవస్థానాముల వంశ పారంపర్య ధర్మకర్త శ్రీనివాసాచారితో పాటు పలువురు పాల్గొన్నారు.

## పోచమ్మ దేవాలయం అభివృద్ధికి నిధులు కేటాయించాలి


రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**చార్మినార్, జూన్ 14 ప్రభాతవార్త :** పాతబస్తీ మహరాజ్ గంజ్‌లోని శ్రీ నల్ల పోచమ్మ మందిరం అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ కోరారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను కలిసి పులిపాటి రాజేష్ కుమార్ వినతి పత్రం అందజేశారు. పురాతనమైన శ్రీ నల్ల పోచమ్మ మందిరం అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరామని పులిపాటి రాజేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అలీషాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## బేగంపేటలో టెంకాయ తలసాని అంటూ ఫ్లెక్సీల కలకలం


బేగంపేటలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్.

**బేగంపేట జూన్ 14, ప్రభాతవార్త** సనత్ నగర్ నియోజకవర్గం పరిధిలోని బేగంపేట డివిజన్ లో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వెలిసిన ఫ్లెక్సీలు కలకలం రేపాయి. సొమ్ము ఒకరిది సోకు మరొకరిది టెంకాయ తలసాని అని బేగంపేట పాటిగడ్డలో సనత్‌నగర్ ఎమ్మెల్యే అభివృద్ధి పనుల కోసం వేసిన శిలాఫలకం వద్ద వెలియడం తీవ్ర కల కలం రేపింది. కాంగ్రెస్ ప్రభుత్వం సొమ్ముతో శంఖుస్థాపనలు, అభివృద్ధి పనులు చేయిస్తూ బీఆర్ఎస్ నాయకులు తాము చేపిస్తున్నామని టెంకాయ తలసాని చెప్పున్నాడంటూ వ్యంగ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం పెద్ద దుమారం రేపింది. అయితే శుక్రవారం అభివృద్ధి పనుల కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్దే ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ ఫ్లెక్సీలు ఎవరు ఏర్పాటు చేసారన్నది తెలియాల్సి ఉంది.

## విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

**-విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు**
**-అత్యవసర టీంలతో విస్తృత సేవలు**

**సికింద్రాబాద్, జూన్ 14 ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం కోసం ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఉన్న సిబ్బందితో వినియోగదారులకు సేవలు అందజేస్తున్నప్పటికి సేవలను విస్తృతం చేసేందుకు సికింద్రాబాద్ సర్కిల్ ప్యారడైజ్ డీఈ పర్యవేక్షణలో ప్రయత్నాలను చేస్తున్నారు. ప్రస్తుతం వార్షాకాలం కావడం వల్ల తరచు విద్యుత్ సరఫరాలో అంతరాయం, ట్రాన్స్‌ఫార్మర్‌లు పనిచేయకపోవడం లాంటి సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. నిమిషాల వ్యవధిలోనే విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు.

ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉండడం వల్ల ప్రమాదాల నివారణకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. ప్రమాదకరంగా విధులు నిర్వహించే సిబ్బందికి, వినియోగదారులకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా అవగాహన కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం జరుపుతున్నారు. ప్యారడైజ్ డివిజన్ పరిధిలో దాదాపు 2వందల మంది సిబ్బంది ఉండగా డివిజన్ పరిధిలో ఉన్న 9 సెక్షన్‌ల పరిధిలో 1లక్షా 72వేల 477 మంది వినియోగదారులు ఉన్నారు.

**వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలి....**

డివిజన్ పరిధిలో ఉన్న 9 సెక్షన్‌ల పరిధిలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నప్పటికి వినియోగదారులు కొందరు సకాలంలో బిల్లులను చెల్లించని కారణంగా సిబ్బందిని బిల్లులు వసూల్ చేయడం కోసం విధిగా నియమించాల్సి వస్తోంది. విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన సమయంలో దాదాపు 70శాతం వినియోగదారులు మాత్రమే చెల్లిస్తున్నారు. దాదాపుగా 52వేల మంది వినియోగదారులు బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యంగానే ఉంటున్నట్లు తెలుస్తోంది. దీంతో బిల్లుల వసూల్ కోసం తప్పనిసరి పరిస్థితిలో సిబ్బందిని కేటాయించాల్సి వస్తోంది. ప్రతినెల మొదటి తేదీ నుంచి దాదాపు 10 తేదీ వరకు మీటర్‌ల రీడింగ్ తీయడం కోసం సిబ్బందిని కేటాయించగా 20వ తేదీ నుంచి బిల్లులు చెల్లించని వినియోగదారుల వద్దకు సిబ్బంది వెళ్లాల్సి వస్తోంది. దాదాపు నెలాఖరు వరకు బిల్లుల వసూల్ కోసమే సమయం గడిచిపోతుండడంతో కొన్నిసార్లు సేవలు అందించడంలో ఆలస్యం నెలకొంటోంది. వినియోగదారుల నివాసాలకు వెళ్లడం, ఆటోల ద్వారా బిల్లులు చెల్లించాలని ప్రచారం చేయడం వల్ల విద్యుత్ శాఖకు భారంగానే ఉంటోంది.

**ఇతర సేవలకు ఆటంకంగా....**

ఉన్న సిబ్బందిని రీడింగ్ తీయడం, బిల్లుల వసూల్‌కు వినియోగించడం వల్ల కొన్నిసార్లు అత్యవసర సేవలు, మెయింటనెన్స్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వర్షాకాలంలో విద్యుత్ తీగలకు తగిలే విధంగా చెట్ల కొమ్మలు పెరిగిపోతుండడం వల్ల వాటిని తొలగించడం సమస్యగా తయారవుతోంది. ఉన్న సిబ్బందితో పరిరోజుల పాటు మీటర్ రీడింగ్‌లు, పది రోజులు బిల్లుల వసూల్‌లకు ఉపయోగించడం వల్ల మీటర్‌లకు కాలిపోయినా, ఇతర మరమ్మతులు వచ్చినా మార్చడం, నూతన కనెక్షన్‌లను ఏర్పాటు చేయడం, పాడైన మీటర్‌ను చెక్ చేయడం కోసం టెస్టింగ్‌కు తీసుకెళ్లడం కోసం ఒకరోజు పూర్తిగా కేటాయించాల్సి రావడం వల్ల అనుకున్న స్థాయిలో సేవలు అందించలేకపోతున్నారు. వర్షాకాలం కావడం వల్ల విద్యుత్ శాఖ సిబ్బందికి ప్ర మాదాలు జరుగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరమ్మతుల సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు. అ లాగే వినియోగదారుల విషయంలో కూడా అప్రమత్తం గా ఉండాలని, సమస్యలు వచ్చినప్పుడు విద్యుత్ శాఖ అధికారులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

### అధికారి వివరణ...
**-సిహెచ్. బ్రహ్మనందం డీఈ ప్యారడైజ్ డివిజన్**



వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం కోసం కృషి చేస్తున్నాము. విద్యుత్ కోతలు రాకుండా అవసరమైన ప్రతీ చోట ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నాము. అత్యవసర పరిస్థితిలో కూడా సిబ్బందిని ప్రత్యేకంగా టీంల వారీగా ఏర్పాటు చేశాము. అందుబాటులో ఉన్న సిబ్బందితోనే వినియోగదారులకు అందించే సేవల్లో లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాము. వినియోగదారులు కూడా సకాంలో బిల్లులు చెల్లిస్తే బిల్లుల వసూల్‌కు ఉపయోగించే సిబ్బందిని కూడా వినియోగదారుల సేవలకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. సేవలను విస్తృతం చేయడానికి విద్యుత్ శాఖకు అవకాశం లభిస్తుంది

## బోనాలకు ముస్తాబవుతున్న గోల్కొండ కోట


గోల్కొండ కోటలో పెయింటింగ్ పనులు.

**మెహదీపట్నం, జూన్ 14, ప్రభాతవార్త :** ఆషాడమాస బోనాల ఉత్సవాలకు గోల్కొండ కోట ముస్తాబవుతుంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే బోనాల ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందు లు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుంది. బోనాల ఉత్సవాలకు నగరం నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివచ్చి శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. దీంతో దేవాలయాన్ని వివిధ రంగులతో తీర్చిదిద్దడం, పరిసరాలతో పాటు గోల్కొండకు వెళ్లే రహదారులను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా దేవాలయ బోనాల ఉత్సవాల కమిటీ చైర్మన్ కొండెపూడి చంటి బాబు మాట్లాడుతూ...ఆషాడ మాస బోనాల ఉత్సవాలు గోల్కొండ కోట నుంచే మొదటగా ప్రారంభం కావడం ఆనవాయితీగా వస్తుందన్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి ప్రతి ఏడూ లక్షలాది భక్తులు తరలివస్తుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో ముందుకెళ్తున్నామని వివరించారు. ఇప్పటికే వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించడం తో పాటు గత వారం రోజులుగా గోల్కొండ కోటలో పెయింటింగ్ పనులు జరుగుతున్నాయని, మరో రెండు మూడు రోజుల్లో పనులు ముగుస్తాయన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నా: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**నార్సింగి, జూన్ 14 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీత వేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం కార్పోరేషన్ పరిధిలోని 8,9,10,11.డివిజన్ల పరిధులలో రూ.6.కోట్ల 92.లక్షలతో నూతనంగా చేపడుదుతున్న సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజి పనులకు కమీషనర్ శరత్‌చంద్ర, మాజీ మేయర్ బి.మహేందర్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్ను నాలుగు సార్లు అసెంబ్లీకి పంపించిన రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలకు ఎంత చేసినా తక్కువే అవుతుందన్నారు. ప్రజలిచ్చిన అధికారంతోనే ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి ఇబ్బందులు తెలుసుకొని పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించినప్పుడు కలిగే సంతృప్తి మాటల్లో వర్ణించలేమన్నారు. పని చేసే నాయకులకు, అధికారులకు ప్రజలు సహకరిస్తే మరింత వేగంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. భవానీ నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణంకు ఎస్టిమేట్ చేయమని అధికారులకు ఆదేశాలిచ్చామని, త్వరలోనే ఆ పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, మాజీ కార్పోరేటర్లు బి.సాగర్‌గౌడ్, శ్రీనాథ్‌రెడ్డి, ప్రశాంత్ నాయక్, నాయకులు సురేష్‌గౌడ్, సుమన్‌గౌడ్, హరీష్‌గౌడ్, గణేష్, సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలో అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

## యాదాద్రి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

**నార్సింగి, జూన్ 14 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని యాదాద్రి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ స్థానికులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు శనివారం వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు మధుకర్, రఘుగౌడ్, సంపత్ గౌడ్‌లు మాట్లాడుతూ మా కాలనీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, గత వేసవిలో నీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డామన్నారు. అంతర్గత రోడ్లన్నీ మట్టివే ఉన్నాయని, దీంతో వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వీలైనంత త్వరగా సీసీ రోడ్లు వేసి ఈ సమస్యను తీర్చాలని కోరారు. అలాగే లోడ్ ఎక్కువై తరుచూ ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్యలు వస్తున్నాయని, ఇక్కడ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మా కాలనీ సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతిపత్రంలో కోరామని వివరించారు. కాలనీ ప్రజల వినతిపత్రంను చదివిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పందిస్తూ వెంటనే ఈ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే స్పందన పట్ల యాదాద్రి కాలనీ ప్రజలు సంతోషంను వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బద్యానాయక్, నరేందర్‌రెడ్డి, మహేష్, శ్యామల, రాజేష్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.


యాదాద్రి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు.

## విమాన ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి

**-ఆమ్ ఆద్మీ రాష్ట్ర నేతల డిమాండ్**

**ముషీరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆమ్ ఆద్మీ రాష్ట్ర నేతలు విజయ్ ముల్లంగి, బుర్ర రాముగౌడ్, డాక్టర్ అన్సారి, అఫసలాం, డాక్టర్ సాల్‌మన్‌రాజులు డిమాండ్ చేశారు. విమాన ప్రమాద మృతుల ఆత్మకు శాంతి కలగాలని ఆమ్ ఆద్మీ శ్రేణులు శనివారం సాయంత్రం ట్యాంక్ బండ్‌పై కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిర్ ఇండియా ప్రయాణికులతో పాటు యువ వైద్య విద్యార్థులతో సహా అనేక మంది ప్రాణాలు కోల్పోవటం హృదయ విదారకమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రమాదానికి ఎవరు జవాబుదారీ అని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలతో అటల్ సేతు పనులు ప్రారంభించిన తరువాత పగుళ్లు కొత్త రైల్వే స్టేషన్ల పై కప్పులు కూలి పోవటం, విమానాశ్రయాలు నీటి ఫౌంటేన్‌లుగా మారిపోతున్నాయని ఆరోపించారు. మన దేశంలో జీవనం విలువ రోజు రోజుకు దిగజారిపోతోందని, మోదీ ప్రభుత్వానికి ప్రభుత్వ పరిశ్రమల కన్నా ప్రైవేటీకరణ పైన ఆసక్తి ఎక్కువని, విమాన చార్జీలు పెంపుపై ఉన్న శ్రద్ధ ప్రజల సంరక్షణపై లేదని విమర్శించారు. గతంలో లాల్ బహదూర్ శాస్త్రి కేంద్ర రైల్వే శాఖా మంత్రిగా ఉన్నప్పుడు రైలు ప్రమాదం జరిగితే బాధ్యత వహించి, రాజీనామా చేసి, ప్రమాదంపై విచారణ జరిపించి, దోషులకు శిక్ష వేయించారని గుర్తు చేశారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వం ఏ ప్రమాదం జరిగినా తమ తప్పును వేరేవారి మీద రుద్దటం పరిపాటి అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విమాన ప్రమాదానికి బాధ్యత వహించి, కేంద్ర విమానయాన శాఖ మంత్రి ఎర్రం రామ్మోహన్‌నాయుడు రాజీనామా చేయాలని, విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని, మరొకసారి ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు లక్ష్మనాయుడు, టి.రాకేష్ సింగ్, రాకేష్‌రెడ్డి, రహమాన్ షరీఫ్ పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఆమ్ ఆద్మీ నేతలు

## నార్సింగిలో ఎన్ఎస్‌యుఐ నేతలు ఆందోళన

**నార్సింగి, జూన్ 14 ప్రభాతవార్త :** విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న ఎన్ఎస్‌యుఐ నాయకులపై తప్పుడు కేసులు పెట్టడను నిరసిస్తూ శనివారం నార్సింగి పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు యడపల్లి వెంకటస్వామి మాట్లాడుతూ, నారాయణ కళాశాలలో ప్రభుత్వం సూచించిన తెలుగు అకాడమి బుక్స్ కాకుండ ఇతర పబ్లికేషన్ల బుక్‌లు విద్యార్థులకు అమ్ముతుండడంను మా ఎన్ఎస్‌యుఐ నాయకులు అడ్డుకుంటే కళాశాల యాజమాన్యం మా నేతలపై బుక్స్ ఎత్తుకెళ్లారని తప్పుడు కేసులు పెట్టారన్నారు. ఈ తప్పుడు కేసులను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎన్ఎస్‌యుఐ విద్యార్థులకు మేలు చేసేందుకు ఉద్యమిస్తుందని, పోరాడుతుందని దొంగతనాలు చేయడం మాకు చేతకాదన్నారు. విద్యను వ్యాపారమయంగా మార్చి పేద విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసుకుంటున్నారన్నారు. కార్పోరేట్ దోపిడికి వ్యతిరేఖంగా ఎన్ఎస్‌యుఐ ఉద్యమిస్తుందన్నారు.

## సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆస్తులమ్మి రాజకీయాలు చేశాం : సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి


దరఖాస్తులను స్వీకరించిన పార్టీ నాయకులు

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 14, ప్రభాతవార్త** సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆస్తులమ్మి రాజకీయాలు చేస్తున్నామని పదవుల కోసం ఎప్పుడూ పాకులాడలేదని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తను పార్టీ హక్కున చేర్చుకుంటుందన్నారు. పదవులు రాలేదని ఎవరు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదన్నారు. కూకట్పల్లి నియోజకవర్గానికి సంబంధించి బ్లాక్ అధ్యక్షులు డివిజన్ అధ్యక్షుల నియామకాల కోసం దరఖాస్తులను శనివారం మూసాపేట్‌లోని పార్టీ కార్యాలయంలో కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో సేకరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ దుర్గం భాస్కరరావు కూకట్పల్లి నియోజకవర్గ పరిశీలకురాలు పారిజాత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆశావాహుల నుంచి దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ పార్టీ నాయకులు ప్రజాక్షేత్రంలో ఉండాలని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. త్వరలో కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతాయని నాయకులు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. అధిష్టానం దరఖాస్తుల పరిశీలన అనంతరం డివిజన్ బ్లాక్ అధ్యక్షులను ప్రకటించడం జరుగుతుందన్నారు.

## నగరంలో పబ్‌లపై ఎస్వోటీ దాడులు

**- మాదకద్రవ్యాలు సేవించిన నల్గురు అరెస్ట్**

**హైదరాబాద్, జూన్14, ప్రభాతవార్త:** మాదకద్రవ్యాలు, గంజాయిల్లాంటి నిషేధిత పదార్థాలను వినియోగిస్తున్నారని గచ్చిబౌలి ఎస్వోటీ పోలీసులు శుక్రవారం రాత్రి పబ్‌లపై దాడులు చేశారు. నల్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. గచ్చిబౌలి, మాదాపూర్‌తో పాటు ఆయా ప్రాంతాల్లోని ఎస్ఎల్ఎన్ టెర్మినల్, క్లబ్‌రఫ్, ప్రాట్‌హౌస్‌తో పాటు తదితర పబ్‌లో మత్తుపదార్థాలు ఉన్నాయనే సమాచారంతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. దీంతో ప్రాట్‌హౌస్ డీజే ప్లేయర్ శివతో పాటు మరో ముగ్గురు కూడా గంజాయి సేవించినట్లు గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని లోతుగా విచారిస్తున్నారు. ఎక్కడి నుంచి సరఫరా అయ్యిందనే విషయాలు రాబడుతున్నారు.

## కుటుంబకలహాలతో గృహిణి ఆత్మహత్య

**హైదరాబాద్, జూన్14, ప్రభాతవార్త:** కుటుంబకలహాలతో ఓ గృహిణి భారీ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని ఎలూరి జిల్లా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొక్కిని శ్రావణి (30) జీవనోపాధికై నగరానికి వచ్చి ఎర్రగడ్డలోని జనప్రియ అపార్టుమెంట్‌లో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదే అపార్టుమెంట్‌లో హౌజ్‌కీపింగ్ పనులు నిర్వహిస్తుంది. కొంతకాలంగా ఆర్థికసమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మళ్లీ గొడువలు చోటుచేసుకోవడంతో మానసికంగా కృంగిపోయి ఐదవ అంతస్తుకు వెళ్లి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కళల కాణాచి తెలంగాణ ధూంధాం

**రవీంద్రభారతి, జూన్ 14 ప్రభాతవార్త :** దశాబ్దాల తెలంగాణ ప్రజల కల కోరిక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఎన్నో పోరాటాలు, ప్రజా ఉద్యమాలతో సాకారానికి మూలకారణం కళాకారులు, సాహిత్యం, ఉద్యమకారులు, బలిదానాలే అయినా ముఖ్యంగా కళల కాణాచిగా పేర్గాంచిన తెలంగాణ సంప్రదాయ, జానపద, చైతన్యాన్ని ఉవ్వెత్తున రేపిన ధూంధాం కళాప్రదర్శనలేనని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ సాంస్కృతిక, సామాజిక, సాహిత్య కళాసంస్థ భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్ష కార్యదర్శులు లయన్ లలితా రావు, లయన్ కె.వి.రమణారావుల నిర్వహణలో రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞ శర్మ సభాధ్యక్షతన జరిగిన శాస్త్రీయ, సంప్రదాయ, జానపద, ఆధ్యాత్మిక, దేశభక్తి గీతాలు, కీర్తనల కళాప్రదర్శనలతో ఉర్రూతలూగించిన తెలంగాణ ధూంధాం కళాప్రదర్శనల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దామోదార్‌గుప్తా విశిష్ట అతిథులు జె.ఎల్.శ్రీనివాస్, స్వాతి మీనన్, పలువురు నృత్యగురువులతో కలిసి జ్యోతి ప్రకాసనంచేసి తెలంగాణ అమరవీరులకు 2నిముషాల మౌనం పాటించి ఘననివాళులర్పించి స్మరించుకుని జోహార్లు అర్పించారు. దైవజ్ఞశర్మ అధ్యక్షోపన్యాసంలో అనేక సంవత్సరాలుగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, శాస్త్రీయ ప్రాచీన, జానపద కళలకు, కళాకారులు, సేవా మూర్తులకు ప్రోత్సాహం, సేవలందిస్తున్న భారత్ ఆర్ట్స్ అకాడమీ తెలంగాణ అమరవీరులకు కళానీరాజనంతో జోహార్లు అర్పించడం ప్రశంసనీయమన్నారు. చివరిగా గురువులను ఘనంగా సత్కరించి ప్రదర్శనలిచ్చిన కళాకారులను జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో ఘనంగా సన్మానించి శుభాభినందనలు తెలిపారు.


తెలంగాణ ధూంధాంతో తెలంగాణ అమరవీరులకు నీరాజనం సమర్పిస్తున్న దామోదర్‌గుప్తా, దైవజ్ఞశర్మ, రమణారావు, లలితారావు, గురువులు తదితరులు

## కాంగ్రెస్ నేతల్లారా ఖబడ్దార్

**-ఎమ్మెల్యే తలసానిని విమర్శించే స్థాయి మీది కాదు**
**-బిఆర్ఎస్ మాజీ బేగంపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి రాగ నాగరాజు గౌడ్**


ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వేసిన పోస్టర్‌ను తొలగిస్తున్న మాజీ బీఆర్ఎస్ బేగంపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి రాగ నాగరాజు గౌడ్.

**బేగంపేట జూన్ 14, ప్రభాతవార్త** సనత్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధికోసం అహర్నిశలు కృషి చేస్తూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతూ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించే ఎమ్మెల్యే తలసానిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని, ఇష్టం వచ్చినట్లుగా పిచ్చిరాతలు రాస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని బీఆర్ఎస్‌మాజీ బేగంపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి రాగ నాగరాజు గౌడ్ కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. ఎమ్మెల్యే సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఎంత అభివృద్ధి చేసారో కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే చర్చకు రావాలన్నారు. నియోజకవర్గంలోని బస్తీల్లో తలసాని హయాంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, నాగరాజు గౌడ్ అన్నారు. పనులు చేయడం చేత కాక అభివృద్ధి పనులు చేస్తున్న తలసానిని చూసి కాంగ్రెస్ నాయకులకు వెన్నులో వణుకు పుడుతుందని, దొంగ చాటుగా పిచ్చి రాతలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే ప్రజల నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కో వల్సి ఉంటుందని నాగరాజు హెచ్చరించారు. ఈ సందర్భంగా పాటిగడ్డ అభివృద్ధి పనుల కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఏర్పా టు చేసిన ఫ్లెక్సీలను నాగరాజు గౌడ్ తొలగించారు. ఈ కార్యక్ర మంలో శేక్ ఆరీఫ్, శరణ్, మహ్మద్ అస్లాం, ఎం.ఏ.ఖాలిద్ ఉన్నారు.

## పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

**-సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన సానేం శ్రీనివాస్ గౌడ్**



**అత్తాపూర్ జూన్14, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం జూబిహిల్స్ నివాసంలో సిఎం రేవంత్ రెడ్డిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సానెం శ్రీనివాస్ గౌడ్ కలిసి సన్మానించి ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా చోటు కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సానెం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాని వమ్ము చేయకుండా కష్టపడి ఇచ్చిన పదవికి వన్నె తెచ్చేలా పనిచేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. పార్టీలో కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ నాయకులతో కలిసి కట్టుగా పనిచేస్తానని పేర్కొన్నారు.

## చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్పనకు డాక్టరేట్



**హైదరాబాద్, జూన్ 14 ,ప్రభాతవార్త** ప్రొఫెసర్ జె.నర్సింహారావు పర్యవేక్షణలో డాక్టర్ జి. కల్పన డాక్టరేట్ అందుకున్నారు. 'తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ జిల్లాలో ప్రాథమిక విద్య ఆర్థిక విశ్లేషణ'అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ పొందారు. కల్పిన చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆమెను ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ రాములు, డాక్టర్ లక్ష్మీ, డాక్టర్ రత్నాకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా 10 వేల పండ్ల మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 14, ప్రభాతవార్త**
ఆపరేషన్ సింధూర్‌లో భారత సైన్యం విజయానికి సూచికగా ఉచితంగా 10 వేల పండ్ల మొక్కల కార్యక్రమానికి కూకట్పల్లి జనసేన నేత ఇంచార్జ్ ప్రేమ కుమార్ హాజరయ్యారు. కెపిహెచ్బి కాలనీ 3వ ఫేస్ రమ్య గ్రౌండ్స్‌లో వాసుదేవుడు ఆహ్వానం మేరకు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, జస్టిస్ భవానీ ప్రసాద్, మిరియాల రాఘవ రావు, వాకాడ తిరుమలరావు, బసవాల శ్రీనివాస్, అంధే శ్రీరామ్ మూర్తి, యర్రా ఆనందరావు, దాసరి రంగారావు, మోటెపల్లి భరత్, హెచ్ను మూర్తి, వుచా రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ ఉచితముగా 10 వేల పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం, రక్తదాన కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తినీ ఇచ్చే కార్యక్రమాలని, ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు చెయ్యాలని వాసుదేవుడు మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ వారికి అభినందనలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వీరమహిళలు మెగా అభిమానులు పాల్గొన్నారు.

### నల్ల పోచమ్మ తల్లి దేవాలయం నూతన కమిటీ నియామకం



కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 14, ప్రభాతవార్త**
కూకట్పల్లి సర్కిల్ పరిధిలోని దేవినగర్ శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవాలయం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఆలయ కమిటీ నూతన అధ్యక్షులుగా మాధవరం రామచంద్రరావు, సలహాదారులుగా ఎస్ రామచంద్రరావు, ఎన్ శ్రీనివాసరావు (తులసిరావు), ఎం నర్సింగరావు, ఎం అశోక్, కమిటీ సభ్యులుగా జే. అమరేంద్రరావు, డి.వెంగళరావు, బద్రి ప్రసాద్ శర్మ, డి. నర్మదా రెడ్డి, ఎం లక్ష్మీ యాదవ్, కుమ్మరి బిక్షపతి, జి నర్సింగ్ గౌడ్, శేఖర్, వివేక్వర్ధన్, ఎం. వెంకట్రావు, జి. వెంకటేశ్వరరావు, జై యాదగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఆలయ కమిటీ సభ్యులు శనివారం కూకట్పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావును కలిశారు. అనంతరం ఆయన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మర్యాద అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

**జీడిమెట్ల, జూన్ 14, ప్రభాతవార్త**
క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం 130 సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్ నగర్‌లోని బాడ్మింటన్ ఇండోర్ షటిల్ కోర్ట్ నందు ఏస్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న బాడ్మింటన్ టోర్నమెంట్‌ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అనంతరం టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభింపచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జి. హేమలతా సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, ఎస్.ఆర్. నాయక్ నగర్, అపురూప కాలనీ, మోడీ బిల్డర్స్ కాలనీల కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి వివేక్‌ను కలిసిన ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ



మంత్రి వివేక్ ను కల్సి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ.

**బేగంపేట జూన్ 14,ప్రభాతవార్త**
ఇటీవల కార్మిక మైనింగ్ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని దళిత చైతన్య సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ శుక్రవారం కల్సి శుభాకాంక్షలు తెలియజేసారు. దళిత నేతకు మంత్రి పదవి రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ వివేక్ వెంకటస్వామికి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. దళితులంతా ఐక్యంగా ఉండాలని ప్రజల సమస్యలు తన దృష్టికి తీసుకు రావాలని ఈ సందర్భంగా మంత్రి వివేక్ అన్నట్లు ముప్పిడి తెలియజేసారు. మంత్రిని కల్సి అభినందించిన వారిలో బట్టు నవీన్‌కుమార్, రమేష్‌లు ఉన్నారు.

### సిఎంఆర్ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే కాలేరు



లబ్ధిదారులకు చెక్కులు పంపిణి చేస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:**
పేదలకు అపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక చేయూత అందిస్తోందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం గోల్నాక క్యాంపు కార్యాయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన 35 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.14.90లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ. పేదలకు ఆపత్కాలంలో ఆర్థిక చేయూత అందిసునతందన్నారు. వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రతి ఏటా సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో వేలాది మంది పేదలకు వైద్య సేవలకు సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు తెలిపారు.

## నాలా విస్తరణ పనులు చేపట్టిన హైడ్రా సిబ్బంది

**బేగంపేట జూన్ 14,ప్రభాతవార్త**
బేగంపేట నందిని హోటల్ వద్ద నాలా విస్తరణ పనులను హైడ్రా ఆధ్వర్యంలో చురుగ్గా నిర్వహిస్తున్నారు. గడచిన మూడు రోజులుగా నాలా ఆక్రమణపై సర్వే నిర్వహించి నాలా పూడిక తీత పనులను విస్తృతంగా చేపట్టారు. పెట్రోలు బంక్ నుంచి రహదారి కింద ఉన్న నాలాను ఆధునిక పరికరాల ద్వారా పరిశీలించి రెండు ఖానాలలో 10అడుగుల మేర పూడిక పేరుకుపోయిందని గుర్తించిన అధికారులు పూడిక తీత పనులను ముమ్మరంగా చేపట్టారు. ప్రధాన రోడ్డు లో మార్కు చేసి రోడ్డును తవ్వి పూడికను తొలగిస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే రెండు కానాలలో పేరుకు పోయిన పూర్తి పూడికను తొలగించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**పూడిక తీత కారణంగా ఆగుతూ సాగుతున్న**
నాలా పూడిక తీత పనుల కారణంగా బేగంపేట ప్రకాశం నగర్ మెట్రో స్టేషన్ వద్ద ట్రాఫిక్ మెల్లగా ఆగుతూ సాగుతుంది. ఇదే ప్రాంతంలో ఫ్లై ఓవర్ కూడా ఉండటంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఉదయం ,సాయంత్రం సమయంలో అటు కార్యాలయాలకు వెళ్లే వారు



నందిని హోటల్ వద్ద నాలా పూడిక తీత పనులు చేపట్టిన హైడ్రా సిబ్బంది

పాఠశాలలకు వెళ్లే వారి వాహనాల రద్దీతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ మెల్లగా సాగుతుంది. దీంతో వాహన దారులు కొంత అసౌకర్యారనికి గురవుతున్నారు. అధికారులు మరింత వేగంగా పనులు నిర్వహించాలని, ట్రాఫిక్ కు అంతరాయంగా మారిన పనులను మరింత వేగంగా పూర్తి చేయాలని వాహన దారులు స్థానికులు కోరుతున్నారు.

## 65 వేల ఆటోలకు పర్మిట్లు జారీ చేసినందుకు సిఎం ఫోటోకు పాలాభిషేకం

**సైఫాబాద్, జూన్ 14 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి, ఓఆర్ఆర్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 65 వేల ఆటోలకు నూతనగా పర్మిట్లకు ఉత్తర్వులు జారీ చేయడం పట్ల అఖిల భారత అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసి) ఆటో యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్‌లో సిఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేంద్రకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి పోటోలకు ఆటో డ్రైవర్లు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రక్ష మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా కొత్త ఆటోలకు పర్మిట్లు జారీ చేయడం అభినందనీయమని, ఆనేక మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అలాగే రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేసి అదుకోవాలని



సిఎం ఫోటొకు పాలాభిషేకం చేస్తున్న రుద్రక్ష మల్లేష్

ఆయన విజ్ఞప్తి చేశారు. కెకెసి ఛైర్మన్ కౌశల్ సమీర్ మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతోనే 65 వేల ఆటోలకు పర్మిట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.

### నిమ్స్ ఆసుపత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం

**పంజగుట్ట, జూన్ 14 (ప్రభాతవార్త)ః**
నిమ్స్ రక్తదాన కేంద్రం హెచ్‌వోడి డాక్టర్ సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిమ్స్ ప్రాంగణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్య విద్యార్థులు, రక్తదాన కేంద్ర సిబ్బంది, ఫిజియోథెరఫీ అలైడ్ హెల్త్ పారా మెడికల్, నర్సింగ్ విద్యార్థులు, ఇతర విభాగాల సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొ.డి.శాంతి, డాక్టర్ ఉరళీకృష్ణ, డాక్టర్ మహేష్‌కుమార్‌లు రక్తదానం యొక్క ఆవశ్యకతను గురించి మాట్లాడారు. అనంతరం 1000 బ్లడ్ యూనిట్ల భద్రపరచగల సామర్థ్యం కలిగిన అడ్వాన్స్ టెక్నాలజీ కోల్డ్‌రూమ్‌ను డైరక్టర్ ప్రొ.నగరి బీరప్ప, మెడికల్ సూపరిండెంట్ నిమ్మ సత్య నారాయణలతో కలసి ప్రారంభించి రక్తదాతలకు డైరక్టర్ చేతులమీదుగా సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్య, నర్సింగ్, పారా మెడికల్ నిమ్స్ సిబ్బంది పెద్దఎత్తున రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ సిబ్బంది బిడుగు శేఖర్, జె.వెంకటరత్నం, సి.నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, సుజాత, చిరంజీవి, సేతులక్ష్మి, రేచల్, నీరజ, అలైడ్ హెల్త్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యాగౌడ్, హెల్పినీడి స్వచ్ఛధ సంస్థ ప్రతినిధులు మనోహర్‌బాబు, శివరామకృష్ణ, ప్రకాష్, తలసీమియా గ్రూప్ ప్రతినిధులు శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు..

### అద్వానీ సూర్యారావును అభినందించిన ఈటల రాజేందర్



సూర్యారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఈటెల రాజేందర్

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 14, ప్రభాతవార్త**
కూకట్పల్లి నియోజకవర్గానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అద్వానీ సూర్యారావును ఆయన నివాసంలో మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ కలిసి కాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. తన పుట్టినరోజు సందర్భంగా సేవ కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థులకు పుస్తకాలు పళ్ళను పంపిణీ చేయడం పట్ల అభినందనలు తెలియజేశారు. సేవా కార్యక్రమాలతో పాటు బిజెపి బలోపేతానికి తన వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం సూర్యారావు బిజెపి కార్యాలయంలో విద్యార్థులకు పుస్తకాలను మామిడిపండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాధవరం కాంతారావు, నాయినేని సూర్యప్రకాశ్రావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, ఎం జాల పద్మయ్య, ఆకుల వెంకటస్వామి, నాగరాజు, శ్రీనివాస్ గౌడ్, నర్సింగ్, దుర్గారావు, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

### బోనాలకు రావాలంటూ ఆహ్వానం



మధుయాష్కి గౌడ్ ను శాలువాతో ఘనంగా సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు కాంగ్రెస్ నేతలు.

**మెహదీపట్నం, జూన్ 14, ప్రభాతవార్త :** గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఈనెల 26 నుంచి ప్రారంభమవుతుండడంతో బోనాల ఉత్సవాలకు రావాలంటూ రాష్ట్ర మంత్రులతోపాటు వివిధ పార్టీలకు చెందిన నేతలను ఆలయ కమిటీ సభ్యులు కలుస్తూ ఆహ్వానిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఏఐసీసీ నాయకులు జెట్టి కుసుమ్ కుమార్, టిపిసిసి సీనియర్ నాయకులు మధుయాష్కి గౌడ్ లను బోనాల ఉత్సవాల కమిటీ చైర్మన్ కొండపూడి చంటిబాబు, కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ ఉస్మాన్ బిన్ ఆధ్వర్యంలో కలిసి బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వారికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. సన్మానించిన వారిలో ఆలయ కమిటీ సభ్యులు ఎరుకల సంతోష్ కుమార్ గౌడ్, నాగులపల్లి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసునూరి శ్రీనివాస్, ఆకుల చంద్రశేఖర్, యువజన కాంగ్రెస్ నాయకులు సంతోష్ గౌడ్, గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు బిజ్జ దుర్గాప్రసాద్ లు ఉన్నారు.

### తెహ్రీక్ ముస్లీం ఖబర్‌స్థాన్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం



సమావేశంలో సమస్యలు తెలుసుకుంటున్న డా.కోట నీలిమ.

**బేగంపేట జూన్ 14,ప్రభాతవార్త**
బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలోని తెహ్రీక్ ముస్లీమ్ ఖబరస్థాన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ,పీసీసీ వైస్ ప్రెశిడెంట్ డా.కోట నీలిమ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెహ్రీక్ ముస్లీం ఖబరస్థాన్ కమిటీ అధ్యక్షులు సలీంఖాన్, ప్రధాన కార్యదర్శి హనీఫ్ ఖాన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.కోట నీలిమ దృష్టికి పలు సమస్యలు తీసుకువచ్చారు. మరణించిన వారికి మృత్యు ధృవీకరణ పత్రాలు ఇవ్వలేదని, మరమ్మతులు ఉన్నాయి. స్థలంలో మొత్తం రాళ్లు ఉన్నాయని, లైట్లు ఏర్పాటు చేయలేదని, అన్ని రకాలైన మౌళిక వసతులు కల్పించాలని స్థానిక కోట నీలిమ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలు పరిష్కరిస్తానంటూ హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఆ తరువాత విస్మరించారని, ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసికెల్లి ఖబరస్థాన్‌లో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోట నీలిమ ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు విశాల్ సుధాం. మునీర్‌ఖాన్, నసీరుద్దీన్ (అడ్డూ), మక్బూల్, ఆసిఫ్ ,తస్లీం, బబ్లూ స్థానికులు పాల్గొన్నారు.

## హిందూ స్వశాన వాటికలో సకల సదుపాయాలు కల్పిస్తాం - కార్పొరేటర్ జితేందర్‌నాథ్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

**అల్వాల్, జూన్ 14 ప్రభాతవార్త:** ప్రజావసరాలు మేరకు స్మశాన వాటికలులో సదుపాయాలు కల్పించడం జరుగుతుందని కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. శనివారం మచ్చబొల్లారం హిందూ స్మశాన వాటికలో 25లక్షలు వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. సిసి ఫ్లోరింగ్, సెప్టిక్ ట్యాంక్, అస్థికల గది మరమత్తులు తదితర పనులు పూర్తి చేస్తామని జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్మశాన వాటిక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం



ఆవిష్కరిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, చిత్రంలో ముఠానరేశ్, బ్రహ్మకుమారీస్ జయశ్రీ, ప్రసాద్, వైశాలి

**చిక్కడపల్లి, జూన్ 14 ప్రభాతవార్త:**
అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చిక్కడపల్లి లోని బ్రహ్మకుమారీస్ శాఖలో యోగ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు బ్రహ్మకుమారీస్ జయశ్రీ, ప్రసాద్, వైశాలి వివరించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రికను శనివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేత ముఠానరేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ యోగా లో పాల్గొని శారీరక మానసిక ఆరోగ్యం మెరుగు పరుచుకోవాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం 21 వ తేదీ పురస్కరించుకుని ముందుగానే ఆదివారం సాయంత్రం ఐదున్నర గంటల నుంచి చిక్కడపల్లి బ్రహ్మకుమారీస్ శాఖ ఆవరణలో జరుగుతాయన్నారు.

## అమ్మవారిని కొలవడంతో సర్వదా విజయం చేకూరుతుంది : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**జీడిమెట్ల, జూన్ 14, ప్రభాతవార్త**
శక్తిస్వరూపిణీ అయిన అమ్మవారిని కొలవడం ద్వారా సర్వదా విజయం చేకూరుతుందని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం 125 గాజుల రామారం డివిజన్ మిథిలా నగర్‌లోని శ్రీ విజయ దుర్గా దేవాలయ అష్టమ వార్షికోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శక్తిస్వరూపిణీ అయిన అమ్మవారిని కలవడం ద్వారా విజయప్రాప్తి కలుగుతుందని, అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, సీనియర్ నాయకులు రంగరాయ ప్రసాద్, దేవాలయ



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

కమిటీ సభ్యురాలు రజిని, అమరేశ్వరీ, సీమవో, పద్మా, శివలీల, భవాని, వాణి, మిథిలా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఛైర్మన్ ఠాగూర్, కార్యవర్గ సభ్యులు సురేష్, చెంగల్ రాయుడు, వెలగపూడి శ్రీనివాస్, చంద్రమోహన్, ప్రవీణ్, శివ, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గృహ కార్మికులకు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం చట్టం చేయాలి

**సైఫాబాద్, జూన్ 14 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా గృహాల్లో పనిచేస్తున్న కార్మికులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులతోపాటు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం తక్షణమే సమగ్ర చట్టాన్ని రూపొంది అమలు చేయాలని జాతీయ గృహ కార్మికుల వేదిక (ఎన్‌పిడిడబ్ల్యూ) డిమాండ్ చేసింది. ఈ నెల 16వ తేదీన అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక ప్రతినిధులు లీసి జోసఫ్, వర్గీస్ థెకనాథ్, మంజుల శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 11 లక్షలకు పైగా గృహకార్మికులు ఉన్నారని, కేవలం హైదరాబాద్ నగరంలో 5 లక్షల మంది ఉన్నారని, వీరికి ఏలాంటి గుర్తింపు, చట్టాలు లేవని, సెలవులు, కనీస వేతనాలు లేవని, అంతే కాకుండా లైంగిక వేదింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి బాధలను అర్థం చేసుకున్న సుప్రీంకోర్టు చట్టం తయారు



సమావేశంలో మాట్లాడుతున్న లీసిజోసఫ్

చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా జాప్యం చేస్తున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వారికి చట్టం తయారు చేసి అమలు చేయాలని కోరారు. లేకపోతే కనీసం రాష్ట్రమైన చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## శ్రీవైష్ణవి సంప్రదాయం గొప్పది : జాక్ చైర్మన్ కృష్ణాచార్యులు

**గోషామహల్, జూన్ 14ప్రభాతవార్త:**
గ్రామ, మండల స్థాయిలో వైష్ణవుల సెన్సెస్ జరుగాలని సింగర్ రామాచారి అన్నారు. నగరంలో జరిగిన వైష్ణవ విప్రవ సమావేశంలో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైష్ణవ సంప్రదాయం గొప్పది దీనిని వచ్చే తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. గృహ నిర్మాణాల కొరకు ప్రభుత్వానికి తెల్పి సహాయం పొందాలన్నారు. వీలైనంత అందరూ అందరికి సహాయం చేయాలన్నారు. సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. జె.ఎ.సి ఛైర్మన్ పీచరకృష్ణమాచారి మాట్లాడుతూ ప్రతి గ్రామం నుండి సభ్యత్వ సేకరణ జరుగుతుందన్నారు. గతంలో జరిగిన అవకతకలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. మాజీ కార్పొరేటర్ నందూరి నరేంద్రచార్యులు నిర్మాణత్మకంగా ముందుకు వెళ్లాలని కోరారు. ఇరువది జిల్లాల అధ్యక్షత, కార్యదర్శులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డి.రవి



జాక్ ప్రతినిధులతో చైర్మన్ కృష్ణచార్యులు

కుమార్, కె.సత్యనారాయణాచార్యులు, ట్రస్టు అధ్యక్షులు యాదగిరిచార్యులు, కార్యదర్శి లక్ష్మినారాయణచార్యులు, ప్రసగించారు. సభ తీర్మానం తిరువరంగం ప్రభాకర్ చార్యులు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ, జాక్ రాష్ట్రఅధ్యక్షులు కొండూరి కృష్ణమాచార్యులును ఎన్నుకున్నారు.

## మనమిచ్చే రక్తదానం మరొకరికి ప్రాణదానం : డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి



రక్తదానం చేస్తున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ రవి శేఖర్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 14 ప్రభాతవార్త**
అన్ని దానాల్లో రక్త దానం గొప్పదని అమ్మ జన్మనిస్తే రక్తదాత పునర్జన్మ నిస్తాడని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి.రవి శేఖర్ రెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భముగా శనివారం డాక్టర్ రవి శేఖర్ రెడ్డి పంజాగుట్టలోని నిమ్స్‌లో రక్తదానం స్వచ్ఛంధంగా రక్తదానం చేసారు. ఆ సమయంలో ఒక అభాగ్యుడు తన కుటుంబంలోని వారికి రక్తం అవసరం అయ్యి అక్కడి వారిని బ్రతిమిలాడడం చూసాడు. తన బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్ వారికి అదే బ్లడ్ అవసరం కావడంతో వెంటనే తన బ్లడ్‌ను వారికి ఇవ్వవలసినదిగా హాస్పిటల్ సిబ్బందికి చెప్పారు. తాను 1995 నుండి ఇప్పటి వరకు ప్రతి సంవత్సరములో రెండు, మూడు సార్లు సుమారుగా 75 సార్లు రక్తదానం చేయడం జరిగిందన్నారు. రాజభవన్‌లో చాలా సార్లు ఇచ్చానని ఉమ్మడి రాష్ట్రంలో గవర్నర్ రంగరాజన్, తెలంగాణ ఏర్పాటు తర్వాత గవర్నర్ తమిళసై చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నానన్నారు. ఈ కార్యక్రమములో నిమ్స్ అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ మురళికృష్ణ, డాక్టర్ కోమల్, డాక్టర్ రజనీష్, సిస్టర్స్ నీరజ, అర్చిత తదితరులు పాల్గొన్నారు

## కెటిఆర్‌పై కేసు నమోదు చేయండి

### -చిక్కడపల్లి పోలీసులను ఆశ్రయించిన టిపిసిసి లీగల్ టీమ్



-చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌లో కెటిఆర్‌పై కేసులు నమోదు చేయాలని ఫిర్యాదు చేస్తున్న టిపిసిసి లీగల్ టీమ్

**చిక్కడపల్లి, జూన్ 14 ప్రభాతవార్త:**
తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డిని కించపరిచే విధంగా ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుపై వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ హైకోర్టు న్యాయవాది , తెలంగాణ లీగల్ సెల్ కన్వీనర్ దోనేటి భాను, కాంగ్రెస్ పార్టీ నేతలు శనివారం చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత ఎన్నికల్లో బి ఆర్ఎస్‌ను ఓడించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీపై, సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యతలు చేయడంతో పాటు ప్రతిష్టకు భంగం కలిగే విధంగా మాట్లాడడం దారుణం అన్నారు. ఈనెల 11వ తేదీన జరిగిన మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డిని కించపరిచే విధంగా కెటిఆర్ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఆయనపై వెంటనే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయం పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు, అభిషేక్ కెన్నడి, డిసిసి ప్రధాన కార్యదర్శి గుండు జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

### PUBLIC NOTICE

The General Public is hereby put to notice that my client Sri Nenavath Laxman S/o. Late Ramsingh, R/o. Uppugadda Thanda, Maheshwaram Mandal, Ranga Reddy District he along with his brothers executed registered Agreement of Sale cum GPA bearing document No. 2428/2004 dated 29.05.2004 registered before SRO Maheshwaram in favour of Sri K.R. Nagashwar Reddy S/o. Ramchandra Reddy in respect of his lands in Sy.No.77 to an extent of Ac.2-12 guntas, Sy.No.78 to an extent of Ac.0-25 guntas and Sy.No.94 to an extent of Ac.0-22 guntas, total admeasuring Ac.3-19 guntas, situated at Mansanpally Revenue Village, Maheshwaram Mandal, Ranga Reddy District without receiving any amount from Sri K. R. Nageshwar Reddy and my client has not delivered the possession of the said property to him and also my client did not handed over his original Pattedar Pass Book and Title Deed. At the time of execution of said Agreement of Sale cum GPA the said K.R.Nageshwar Reddy agreed to pay sale consideration within six months and to that effect he executed Undertaking cum Affidavit on 29.05.2004, but inspite of repeated demands made by my client the said K.R.Nageshwar Reddy failed to pay sale consideration to my client and further more that the said K.R.Nageshwar Reddy stated that if he fail to pay sale consideration within six months to my client the said Regd. Agreement of Sale cum GPA shall stand cancelled for his extent of land.

Therefore, I hereby informed that due to non-payment of sale consideration my client shall stand cancelled the said Regd. Agreement of Sale-GPA bearing document No.2428/2004 dated 29-05-2004 for his extent through this Paper Publication and after seven days of publication of this Public Notice the said K.R. Nageshwar Reddy is not having any right or claim in respect of above said by virtue of said Agreement of Sale cum GPA and my client is at liberty to take appropriate take necessary legal action for cancellation of said Regd. Agreement of Sale cum GPA before competent court of Law.

Sd/-. (L.Srinivas)
Advocate
Maheshwaram, Ranga Reddy District.
Phone No: 9912711501.

### PUBLIC NOTICE

The General public is hereby informed that my client Sri Om Prakash Devda, S/o : Late Biharilal Devda, has entered into an agreement of sale for the purchase of part & parcel of Plot bearing No. 1020/part, in Survey No. 156/1, admeasuring & comprising on an area of 150.00 Sq. yards or 125.4 sq.mts., situated at TNGO COLONY, MAILARDEVPALLY VILLAGE, GHMC Rajendranagar Circle, Ranga Reddy District., T.S., bounded by: NORTH : Plot No. 1019, SOUTH : Plot No. 1020/PART, EAST: 30' Feet Wide Road, WEST : Plot No. 1015, from SRI BACHIREDDY LAXMI NARAYAN REDDY, S/o . Sri B. Sai Reddy, Aged about : 55 years, Occupation: Business, Resident of H.No. 9-6-214/2, Durga Bhawani Nagar, Champapet, Saroornagar, Ranga Reddy District, T.S., and my client has paid substantial amount to the Vendor SRI B. LAXMI NARAYAN REDDY, S/o : Sri B. Sai Reddy, by way of advance and earnest amount.

If Any person/s having any right, claim over the said property or objection for the said transaction may intimate the same to the undersigned with all the copies of the documents for such right, claim or objection within (7) days of the publication of this notice, as otherwise the sale will be completed as per law.

Sd/- VEERENDER KUMAR BAHETI
Advocate
OFFICE: 15-7-93,
KOLSAWADI, BEGUM BAZAR,
HYDERABAD-500 012.
(M): 7989736590, 9848921211,
email id : veer.0142@gmail.com

### PUBLIC NOTICE

The General public is hereby informed that my client Sri Om Prakash Devda, S/o : Late Biharilal Devda, has entered into an agreement of sale for the purchase of part & parcel of Plot bearing No. 1020/part, in Survey No. 156/1, admeasuring & comprising on an area of 150.00 Sq. yards or 125.4 sq.mts., situated at TNGO COLONY, MAILARDEVPALLY VILLAGE, GHMC Rajendranagar Circle, Ranga Reddy District., T.S., bounded by:-NORTH: Plot No. 1020/PART, SOUTH:Plot No. 1021, EAST: 30' Feet Wide Road, WEST: Plot No. 1015, from SMT. BACHIREDDY SUVARNA, W/o : Sri B. Sai Reddy, Aged about : 77 years, Occupation : House Wife, H. No. 9-6-214/2, Durga Bhawani Nagar, Champapet, Saroornagar, Ranga Reddy District, T.S., and my client has paid substantial amount to the Vendor SMT. BACHIREDDY SUVARNA, W/o : Sri B. Sai Reddy, by way of advance and earnest amount.

If Any person/s having any right, claim over the said property or objection for the said transaction may intimate the same to the undersigned with all the copies of the documents for such right, claim or objection within (7) days of the publication of this notice, as otherwise the sale will be completed as per law.

Sd/- VEERENDER KUMAR BAHETI
Advocate
OFFICE: 15-7-93,
KOLSAWADI, BEGUM BAZAR,
HYDERABAD-500 012.
(M): 7989736590, 9848921211,
email id : veer.0142@gmail.com

## హమాలీలు, చాట కార్మికులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

**- ఇంచార్జ్ ఎస్ జి ఎస్ చిలుకా నరసింహారెడ్డి**



హమాలీ సంఘం అధ్యక్షులు సురేష్, ప్రధాన కార్యదర్శి దానం శేఖర్ తదితరులతో సమావేశం నిర్వహిస్తున్న ఫుల్ అడిషనల్ ఛార్జ్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలుక నరసింహారెడ్డి తదితరులు

**మలక్ పేట ,జూన్ 14, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ లో పనిచేస్తున్న హమాలీలు, చాట కార్మికులు గుర్తింపు కార్డులు తీసుకోవాలని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ ఫుల్ అడిషనల్ ఛార్జ్ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలుకా నరసింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం మార్కెట్ కార్యాలయంలో హమాలీలు, చాట కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించి వారికి గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డులతో ప్రభుత్వ పథకాలను తీసుకువచ్చని వివరించారు. మార్కెట్ లో సుమారు 542 మంది హమాలీ లు , చాట కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈనెల 30వ తేదీలోపు మార్కెట్లో ఎస్ జి ఎస్ కార్యాలయంలో సంప్రదించి గుర్తింపు కార్డులు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ 3 కార్యదర్శి పుష్ప, సూపర్ వైజార్ పవన్, అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం అధ్యక్షుడు కే. సురేష్, ప్రధాన కార్యదర్శి దానం శేఖర్, కతలయ్య, ఎం. కుమార్ , లక్ష్మణ్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**న-కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ**



రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ తదితరులు

**మలక్ పేట ,జూన్ 14, ప్రభాతవార్త:** అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. ముసారంబాగ్ బస్తీ వద్ద రూ. 21 లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణం పనులను ఆమె స్థానిక బస్తీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీలు, కాలనీలో ని రోడ్లను అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. చాలాకాలంగా అభివృద్ధికి నోచుకోని రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించామని, రాకపోకలకు అంతారాయం కలుగకుండా సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంపత్, స్వామి, అశోక్ ,దేవేందర్, సురేందర్ ,నవీన్, అండళ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం : కార్పొరేటర్ శాంతి సాయిజెన్



స్థానికుల నుంచి వినతిపత్రాన్ని తీసుకుంటున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, జూన్ 14 ప్రభాతవార్త :** సాయి నగర్ కాలనీ వైజయంతి టాకీస్ వెనుక వీధిలో భూగర్భ డ్రైనేజీ సమస్య ఇక్కడ ప్రజలు కొన్నేళ్లుగా చాలా ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 20కి పైగా సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన చిన్న సైజు డ్రైనేజీ పైపుల వల్ల నిత్యం డ్రైనేజీలు నిండి రోడ్లపై నడవలేని విధంగా ఉందని కాలనీవాసులు ఈరోజు కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ను కలిసి నూతన భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేయడం అయినది. తప్పకుండా తొందర్లోనే నూతన డ్రైనేజీ నిర్మాణం చేపడతామని కార్పొరేటర్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జ్యోతి రెడ్డి, ఝాన్సీ, సుజాత, రాధిక, స్వప్న,శ్వేత,శోభ, కనిమోజీ, కిరణ్, వినోద్, లక్ష్మణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలి : మాధవిలత



బ్రహ్మానందంను పరామర్శిస్తున్న బిజెపి నాయకురాలు మాధవిలత

**సైదాబాద్, జూన్ 14 ప్రభాతవార్త:** ఆస్మాన్‌ఘడ్ వెంకటాద్రినగర్ లోని రాక్‌హిల్స్ అపార్ట్‌మెంటు నివాసి బ్రహ్మానందంపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని బిజెపి నాయకురాలు మాధవిలత డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డితో కలసి అపార్ట్‌మెంటును సందర్శించి అపార్ట్‌మెంటులో నివాసముంటున్న వారితో సమావేశమై దాడి వివరాలు తెలుసుకుని ఎవరికి భయపడవద్దని, ఆందోళనకు గురికావద్దని తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. దుండగులు తొలగించిన వినాయకుడి విగ్రహాన్ని అపార్ట్‌మెంటు వాసులతో కలసి పునఃప్రతిష్ట చేశారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బ్రహ్మానందంను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి, వానరసేన నాయకులు పాల్గొన్నారు.

## వ్యవసాయ భూముల లీజు రద్దు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



**తుర్కయంజాల్ జున్ 14 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వ్యవసాయ భూముల లీజు రద్దు చేయాలనీ పలువురు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ తుర్కయం జాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వ్యవసాయ భూముల లీజు రద్దు చేయాలని ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి చెప్తానన్నారు ఈ కార్యక్రమంలో ఇంజాపూర్ గ్రామస్థులు. గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, బొక్క వంశీధర్ రెడ్డి, మల్లెల రవి, మల్లెల శంకర్, ముద్దం సత్తి రెడ్డి, మల్లెల వంశీ, మల్లెల పవన్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం పాలకమండలి సభ్యులు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో దేవాలయ నూతన పాలకమండలి చైర్మన్, సభ్యులు

**సైదాబాద్, జూన్ 14 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం నూతన పాలకమండలి సభ్యులు శనివారం టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మధుయాష్కీ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. దేవాలయ అర్చకులు ముఖ్యమంత్రికి ఆశీర్వచనం అందించగా దేవాలయ కార్యనిరాహణాధికారి లావణ్య స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. కర్మన్‌ఘాట్ హనుమన్ దేవాలయాన్ని సందర్శించాలని ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులు ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పాలకమండలి చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణ రెడ్డి, మాజీ చైర్మన్‌లు నల్ల రఘుమారెడ్డి, ఈశ్వరమ్మ యాదవ్, ధర్మకర్తలు ఎనుముల రవీందర్‌రెడ్డి, పూల నాగరాజు, నారాయణ దుర్గారెడ్డి, జనుంపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, దిండు ప్రవీణ్‌గౌడ్, తోకటి కిరణ్ కుమార్, సింగం శెట్టి శ్రీనివాస్, కుకునూరి గోపాల్ రెడ్డి, కె.కవిత, ఒరుగంటి నరేష్, కొండ్ర సంతోష్ కుమార్, బండిగారి శ్రీనివాస్ గౌడ్, దేవాలయ అర్చకులు కుర్మేటి అంబాప్రసాద్, సంతోష్‌కుమారాచార్యులు, ముత్యాలశర్మ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్ రెడ్డి

**ఎల్.బి. నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** కాలనీలో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధి శ్రీసాయి నగర్ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీ అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. విన్నవించారు. రాత్రిపూట కొన్ని చిల్లర మూకలు రోడ్డుమీద గంజాయి సేవిస్తూ రోడ్డు మీద పోయే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, లక్కీ రెస్టారెంట్ వద్ద అక్రమ పార్కింగ్ల వల్ల కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, రాత్రిపూట పోలీసు బందొబస్తు, రోడ్లపై చిరు వ్యాపారాలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులు తీసుకువచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ భారస పార్టీ నాయకులు ఆనంతుల రాజారెడ్డి, తూర్పాటి చిరంజీవి, గవ్వ శ్యామ్ సుందర్ రెడ్డి,యుగంధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వెంకట రెడ్డి, వి.రవీందర్ రెడ్డి, శ్రీనివాసాచార్యులు,గోపాల్ రావు, శ్రీనివాసరావు,సుదీర్ రెడ్డి, బీమిడి వెంకట్ రెడ్డి, కర్రీ సూర్య ప్రకాష్, అరవింద్ రెడ్డి, నాగేంద్ర ప్రసాద్, అశోక్ కుమార్, శ్రీనివాస్ రావు, వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల్లో పడకేసిన పారిశుధ్యం

## - చెత్త తరలింపులో కార్పొరేషన్ నిర్లక్ష్యం



సాయినగర్ కాలనీలో ఇళ్ళ మధ్య పేరుకపోయిన చెత్త.. కుప్పల్లో తచ్చాడుతున్న వీధి కుక్కలు

**సరూర్‌నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒక వైపు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలు జోరుగా నిర్వహిస్తుంటే మరో వైపు కార్పొరేషన్‌లోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేసింది. ప్రభుత్వ ఆదేశాలు మేరకు సిడిఎంఎ ఉత్తర్వుల మేరకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాలను గత కొన్ని రోజుల నుండి కార్పొరేషన్ లో జరపుతున్న అధికారులకు కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తా చెదారాలు మాత్రం కనిపించకపోవడం గమనార్హం. ప్రతి రోజు కార్పొరేషన్‌లోని కొన్ని డివిజన్లలో పర్యటిస్తున్న అధికారులు సిబ్బందితో వంద రోజుల యాక్షన్ ప్లాన్ బ్యానర్లు చేతపట్టించి ఫోటోలకు ఫోజులిచ్చి అర్భాటం చేస్తున్నారే తప్ప అసలు ప్రజా సమస్యలను తీర్చడం లేదనే విమర్శలు వస్తున్నారు. బాలాపూర్, బడంగ్‌పేట్‌ల సమీపంలోని శ్రీ సాయినగర్ కాలనీలో చాలా రోజుల నుండి కాలనీ మధ్యలో ఇళ్ళ మధ్య చెత్తా చెదారం గుట్టలుగా పేరుకుపోతున్నా కార్పొరేషన్ పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో వర్షాలకు చెత్త నుండి తీవ్ర దుర్గంధం వ్యాపిస్తున్నది. అంతే కాకుండా ఈ ప్రాంతంలో చెత్త కుప్పలపై తచ్చాడుతున్న వీధి కుక్కలు స్థానికులకు సమస్యగా మారాయి. సాయినగర్ కాలనీలో మాదిరిగానే కార్పొరేషన్‌లోని దాదాపు 32 డివిజన్లలో పారిశుధ్య సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయి. అసలే వర్షాకాలం.. చెత్తను తొలగించడంలో కార్పొరేషన్ నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఈగలు, దోమల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వివిధ కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. కార్పొరేషన్‌లోని ప్రాంతాల్లో చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నట్లుగా, శుభ్రం చేస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్న అధికారులు కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. పారిశుధ్య సిబ్బందిని వారి వారి ప్రాంతాల్లో పని చేయనీయకుండా అధికారులు పర్యటించే ప్రాంతాల్లో తిప్పుతుండడంతో చాలా ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు కార్పొరేషన్‌లో పారిశుధ్య సమస్యలు తలెత్తిన ప్రాంతాల్లో దృష్టి సారించి వంద రోజుల యాక్షన్ ప్లాన్ ఉద్దేశ్యాలను చాటాలని కాలనీ సంక్షేమ సంఘాల వారు సూచిస్తున్నారు.

## పాఠశాల, అంగన్వాడి కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలి



**మల్కాజిగిరి జూన్14,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ని మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిసి సర్దార్ పటేల్ నగర్ లో గల ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రం లలో మోలిక వసతులు కల్పించాలని పాఠశాల ఆవరణంలో బాత్రూంలు నిర్మించాలని, పాఠశాల పిల్లలు ఆహారం తయారు చేయుటకు వంటగది నిర్మించాలని, మంచి నీటి వసతి కోసం బోరు బావి వేయించాలని అంగన్వాడి భవనంలో మరియు బయట ప్రదేశంలో ఫ్లోరింగ్ చేయించాలని, ఎమ్మెల్యే కి వినతి పత్రం అందజేశారు. అందుకుగాను ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బి ఆర్ ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు అశోక్ గౌడ్, అంగన్వాడి టీచర్లు సునీత, కళ్యాణి, మోనిక, ఆశా వర్కర్ సునీత, సర్దార్ పటేల్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రాములు, శ్రీకాంత్, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆషాడమాసం బోనాలకు ప్రత్యేక నిధులు ఇప్పించాలి

**-ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యుల వినతి**



**మల్కాజిగిరి జూన్14,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కి మల్కాజ్గిరి నియోజకవర్గ ఆలయ కమిటీల సభ్యులు ఆషాడమాసం బోనాలకు ప్రత్యేక నిధులు ఇప్పించాలని మల్కాజ్గిరి నియోజకవర్గం డివిజన్ల ప్రజలు వినతి పత్రాలను అందజేశారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు తెలియజేసి నిధులు మంజూరు అయ్యేందుకు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా మచ్చ బొల్లారం డివిజన్ మధురానగర్ లో ఉన్న శ్రీ వరసిద్ధి మహాగణపతి దేవాలయానికి తన వంతు సహాయంగా రూ.65,000/ నగదు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దోలి రమేష్, లక్ష్మణ్ యాదవ్, మధుసూదన్ రెడ్డి, జెకె సాయి గౌడ్, శంకర్, శ్రీనివాస్, సురేష్, రమా వివిధ ఆలయాల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎంను కలసిన చిగిరింత దంపతులు



రేవంత్‌రెడ్డిని కలిసిన చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిపిసి మాజీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత, ఆమె భర్త బడంగ్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డిలు శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. వారితో పాటు అల్మాస్‌గూడకు చెందిన మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి కూడా కలిశారు. ఈ సందర్భంగా వారు సిఎంకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి మాట్లాడారు.




## మల్లాపూర్ డివిజన్‌ను దశల వారిగా అభివృద్ధి పరుస్తా

**- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్,చిత్రంలో కార్పోరేటర్ పన్నాల

**నాచారం,జూన్ 14 ప్రభాతవార్త :** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మీనా నగర్ కాలనీలో రూ. 3.5 లక్షల నిధులతో మరియు బ్రహ్మపురి కాలనీలో రూ.17 లక్షల రూపాయల తో చేపట్టినున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్, స్థానిక కాలనీ వాసులు విశ్వరూప చారి, యాకుబ్, నర్సిరెడ్డి, బేతల మల్లేష్, నాగమల్లేశ్, రవి, నర్సింహ, సిద్ధులు, రాఘవరెడ్డి, అంజయ్య, రాములు, శ్రీనివాస్, వెంకటేష్ మరియు స్థానిక నాయకులు కుంటి కృష్ణ, తిగుళ్ల శ్రీనివాస్, తండా వాసుగౌడ్, ఫైళ్ల ప్రవీణ్, విజయ భాస్కర్, అల్లాడి కృష్ణ యాదవ్, నెల్లుట్ల శ్రీనివాస్ గౌడ్, ఉస్మాన్, నర్సింగరావు, లక్ష్మణ్ యాదవ్, రమేష్, మహేందర్ గౌడ్, అశోక్, చినింగల శ్రీనివాస్, లింగాల రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ డివిజన్ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న పరమేశ్వర్ రెడ్డి

**-డివిజన్ అధ్యక్షుడు కప్పర సాయి కిరణ్ గౌడ్**



సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రేస్ శ్రేణులు

**నాచారం,జూన్ 14 ప్రభాతవార్త :** మల్లాపూర్ 5వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం బ్రాహ్మపుర్ని కాలనీ కి డ్రైనేజ్ లైన్ ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి సాకారం తో సుమారు రూ. 9.50 లక్షలు మంజూరైన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు కాలనీ ముఖ్య నాయకులు మహిళలు డివిజన్ సీనియర్ నాయకులు, దంతురి రాజు గౌడ్, మక్తల బాలరాజ్, కోరుకుప్పల సురేష్, డివిజన్ వర్కింగ్ ప్రాసిడెంట్ కోయగూర బాలరాజ్, మైనార్టీ అధ్యక్షులు ఫసిద్దిన్, ఎస్సి సెల్ అధ్యక్షులు మనోహర్ సెక్రటరీ ఉపేందర్ రెడ్డి మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుపుల జయంత్ నర్సింహా ఉపేందర్ మరియు కాంగ్రెస్ నాయకులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గరుడ వాహన సేవ



హోమంలో పాల్గొన్న చైర్మన్ లింగారెడ్డి దంపతులు

**ఎల్.బి. నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** భక్తుల కోలహాల మధ్య భక్తిశ్రద్ధలతో గరుడ వాహన సేవ కార్యక్రమం నిర్వహించారు. గడ్డి అన్నారం డివిజన్ లలిత నగర్ కాలనీలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం గరుడ వాహన సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా మూలమంత్ర ఆహ్వానము, అలంకారము, సుదర్శన ఇష్టి హోమము, నిత్య హోమము ఎదుర్కోలు తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ దేవరం లింగారెడ్డి పూర నరసింహగుప్త, చకిలం రమణయ్య, వక్కలంక శ్రీనివాసరావు, చిదర నాగేందర్, సత్యనారాయణ, ప్రొద్దుటూరు కుమారస్వామి, పాల్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ గణపతి ఆలయంలో సంకల హర చతుర్థి పూజలు



హోమం నిర్వహిస్తున్న పూజారులు

**సరూర్‌నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్ కాలనీలోనున్న శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో శనివారం సాయంత్రం శ్రీ లక్ష్మీ గణపతి హోమం, పంచామృతాభిషేకం ఘనంగా నిర్వహించారు. సంకల హర చతుర్థి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు లక్ష్మీగణపతిరావు, అర్చకులు మధుసూదనాచార్యులు, కరుణాకర్ స్వామిలు మంత్రోచ్ఛారణలతో హోమం, అభిషేకాలు నిర్వహించారు. పలువురు భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఆలయానికి వచ్చి హోమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎంవి కృష్ణారావు, సంతోష్‌రెడ్డి, వెంకట రమణలతో పాటు పలువురు భక్తులు, శివసాయినగర్, టిఎస్ఆర్ నగర్ కాలనీకు చెందిన మహిళలు పాల్గొన్నారు.